24 వేల కోట్లు ఏం చేశారు?

- రైతుబంధు 7,500 కోట్లు, 100 రోజుల అప్పు 16,500 కోట్లేవి?
- రైతులకు భరోసా ఇవ్వలేని సర్కారు
- పంట నష్టం అంచనాలో విఫలం
- సీఎం, మంత్రుల స్పందన ఏది?
- మంత్రి తుమ్మల అబద్ధపు మాటలు
- బీఆర్ఎస్ హయాంలో ఎకరానికి రూ.10 వేల నష్టపరిహారం ఇచ్చాం
- అక్రమాల కోసమే కొందరు పార్టీలు జంప్
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి

హైదరాబాద్, మార్చి 22 (నమస్తే తెలంగాణ): కేసీఆర్ ప్రభుత్వం రైతుబంధు కింద సిద్ధం చేసిన రూ.7,500 కోట్లు, గత వంద రోజుల్లో చేసిన అప్పు రూ.16,500 కోట్లు.. మొత్తంగా రూ.24 వేలకోట్లు ఎక్కడికి పోయాయని కాంగ్రెస్ సర్కారును బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ప్రశ్నించారు. ఈసీకి ఫిర్యాదు చేసి రైతుబంధు డబ్బులను రైతుల ఖాతాల్లో పడకుండా అడ్డుకున్నారని, ఇవ్వాళ ఆ డబ్బును ఎవరు వాడుకున్నారో తెలుసని అన్నారు. ఇంతవరకు రైతుబంధు అందరికీ ఇవ్వలేదని విమర్శించారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఎం శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ కార్యదర్శి రూప్‌సింగ్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. అకాల వర్షాలు, రాళ్ల వానతో రెండు లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగినా, పంట నష్టాన్ని అంచనా వేయటంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో నష్టం తీవ్రత ఎక్కువగా ఉన్నదని, రైతులకు భరోసా కల్పించేందుకు సీఎం, వ్యవసాయ శాఖ మంత్రి, ఇతర మంత్రులు ఎవరూ ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించలేదని మండిపడ్డారు. 40 ఏండ్ల సుదీర్ఘ అనుభవం ఉన్నా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు పంట నష్టంపై పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని, కానీ, బీఆర్ఎస్ సర్కారులో ఎకరానికి రూ.10వేల పంట నష్టాన్ని ఇచ్చినట్టు వెల్లడించారు. ఏదో కొత్తగా ఇస్తున్నట్టు తుమ్మల చెప్తున్నారని అన్నారు. తమ హయంలో అకాల వర్షాలకు పంట నష్టం జరిగితే వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి, మంత్రి సబితాఇంద్రారెడ్డి, తాను వికారాబాద్ జిల్లాలో పర్యటించి రైతులను పరామర్శించామని తెలిపారు. ఆ తర్వాతి రోజు స్వయంగా అప్పటి సీఎం కేసీఆర్ జిల్లాల్లో పర్యటించారని వివరించారు. ఖమ్మం జిల్లా బోనకల్లు, తొర్రూరు మండలం, నర్సంపేట, చొప్పదండికి వెళ్లి పంట నష్టాన్ని పరిశీలించారని గుర్తుచేశారు. నష్ట పరిహారానికి సంబంధించి రూ.151కోట్ల మొదటి దశ జీవో, రెండో దశలో నష్ట పరిహారం అంచనా వేసి 3 వేల గ్రామాల్లో 2.79 లక్షల మంది రైతులకు చెందిన రూ.3.04 లక్షల ఎకరాల్లో పంట జరిగిందని అంచనా వేశామని తెలిపారు. రూ.304 కోట్ల నష్టం జరిగిందని, దాని కోసం జీవో 19 విడుదల చేశామని చెప్పారు. పంటల పరిశీలనలో భాగంగా ఎమ్మెల్యే కాకున్నా తుమ్మల నాగేశ్వరరావును కేసీఆర్ హెలికాప్టర్‌లో ఎక్కించుకొన్నది నిజమా? కాదా? అని ప్రశ్నించారు. పాలేరు నియోజకవర్గంలో భక్తరామదాసు ఎత్తిపోథల పథకాన్ని అతి తక్కువ కాలంలో పూర్తి చేస్తే కేసీఆర్‌ను అపర భగీరథుడు అని తుమ్మల పొగిడింది నిజం కాదా? అని నిలదీశారు.

సాగు, తాగునీళ్లేవి?

కేసీఆర్ హయంలో రైతులు అత్యధికంగా వరి పండించారని, దేశంలోనే తెలంగాణ మొదటి స్థానంలో నిలిచిందని పల్లా రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. రైతులు మిర్చి అత్యధికంగా పండించారని, పత్తి విషయంలోనూ దేశంలో మూడో స్థానానికి చేరుకున్నామని వివరించారు. కాంగ్రెస్ పాలనలో రైతుల ఆత్మహత్యలు మొదలయ్యాయని, దొంగ కరెంట్ ఇచ్చి రైతులను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. తమ హయంలో ఎండాకాలంలోనూ సాగు నీళ్లు ఇచ్చామని, సమ్మక్క బ్యారేజ్ దగ్గర నీళ్లను ఎందుకు ఎత్తిపోయడం లేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రభుత్వానికి ఏం రోగం వచ్చింది? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. సాగు నీరు, తాగు నీరు ఎందుకు ఇవ్వడం లేదని నిలదీశారు.

అక్రమాల కోసమే అధికార పార్టీకి జంపింగ్‌లు

అక్రమాలు చేయడానికే కొందరు అధికార పార్టీలోకి వెళ్తున్నారని, వారి అక్రమాలను బీఆర్ఎస్ పార్టీయే బయట పెడుతుందని పల్లా స్పష్టం చేశారు. కొంతమంది పిరికి పందలు, వ్యాపారమే రాజకీయమని, రాజకీయాలను భ్రష్టుపట్టించినవారు, సిగ్గూఎగ్గూ లేకుండా, ప్రజలు ఏమనుకుంటారోనన్న సోయిలేకుండా.. వ్యక్తిగత స్వలాభం కోసం ఇంకో పార్టీలోకి మారటం శోచనీయమని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ నుంచి ఎన్నికైనవాళ్లు రాజీనామా చేసి వెళ్లాలని డిమాండ్ చేశారు. 'కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ నాయకులను బెదిరిస్తున్నది, కార్యకర్తలను జైల్లో పెడుతున్నది' అని ఆరోపించారు. ఎవరు ఎక్కడికి పోయినా తాము పోలీస్‌స్టేషన్‌కు వస్తామని, అందరినీ కాపాడుకుంటామని స్పష్టం చేశారు. బెదిరించి, అక్రమకేసులు పెట్టి ఇబ్బంది పెడితే వారికి తగిన శాస్తి తప్పదని హెచ్చరించారు.

మందుల గోల్‌మాల్‌పై విచారణ

ఆదేశాలు జారీ చేసిన డీఎంఈ

వరంగల్ చౌరస్తా, మార్చి 22 : వరంగల్ ప్రాంతీయ నేత్ర వైద్యశాలలో మందులను దొడ్డిదారిన కాజేసిన ఉద్యోగి తలకోటి నాగేందర్‌పై శాఖాపరమైన చర్యలకు ఉన్నతాధికారులు ఆదేశించారు. సుమారు రూ.81 వేల విలువజేసే మందులను కాజేసి అక్రమంగా నిల్వ చేసిన, బహిరంగ మార్కెట్‌లో విక్రయిస్తున్న ఇద్దరు నిందితులపై డ్రగ్ కంట్రోల్ అధికారులు దాడులు చేసి పట్టుకున్న ఘటనపై శుక్రవారం డీఎంఈ (డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్) డాక్టర్ వాణి ఆదేశాల మేరకు ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ విచారణ చేపట్టారు. ప్రాంతీయ నేత్ర వైద్యశాలను సందర్శించి జరిగిన ఘటనపై వివరాలు సేకరించి, నిందితులు అక్రమంగా మందులు తరలించిన తీరుపై ఆరా తీశారు. మందులను పక్కదారి పట్టించి బహిరంగ మార్కెట్‌లో అమ్ముతున్న ఓపీ ఫార్మసిస్ట్ తలకోటి నాగేందర్, హైదరాబాద్‌కు చెందిన వ్యాపారి బలరాం దాసుపై నమోదు చేసిన కేసు వివరాలు ఇంతెజార్‌గంజ్ పోలీసుల నుంచి అందిన వెంటనే డీహెచ్‌కు సమాచారం అందించి శాఖాపరమైన చర్యలు తీసుకోనున్నట్టు ఆయన పేర్కొన్నారు.

గేట్ల రాజకీయం మాని.. కరెంట్ సంగతి చూడు

- ఎన్టీపీసీతో వెంటనే విద్యుత్తు ఒప్పందాలు చేసుకోవాలి
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బీజేపీ ఎంపీ లక్ష్మణ్ డిమాండ్

హైదరాబాద్, మార్చి 22 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి గేట్లు ఎత్తే రాజకీయం మాని, రాష్ట్రానికి విద్యుత్తు సరఫరా చేసే సంగతిని చూడాలని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. వంద రోజులుగా సీఎం హోదాలో తాను రోజుకు 18 గంటలు పనిచేశానని, ఇప్పుడు ఎన్నికల వేళ పీసీసీ చీఫ్ అవతారం ఎత్తి గేట్లు ఎత్తుతానని రేవంత్‌రెడ్డి చెప్తున్నారని పేర్కొన్నారు. విభజన చట్టానికి అనుగుణంగా ఎన్టీపీసీలో 4,000 మెగావాట్ల విద్యుత్తు ప్లాంట్ నిర్మిస్తే, 85 శాతం విద్యుత్తు తెలంగాణకు వాటాగా రావాల్సి ఉన్నదని వివరించారు. ఇప్పటికే 1,600 మెగావాట్ల విద్యుదుత్పత్తి మొదలైందని తెలిపారు. మిగతా యూనిట్ల కోసం ఒప్పందం చేసుకోవాలని ఎన్టీపీసీ వరుసగా లేఖలు రాసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక కూడా జనవరిలో రెండు సార్లు లేఖలు రాసిందని, అయినా పట్టించుకోలేదని విమర్శించారు. ఒకవేళ తెలంగాణ ప్రభుత్వం స్పందించకపోతే ఆ విద్యుత్తును వేరే రాష్ట్రానికి మళ్లిస్తామని ఎన్టీపీసీ హెచ్చరిస్తున్నదని చెప్పారు. పగలు కరెంటు లేక రాత్రి వేళ మోటర్ ఆన్ చేయడానికి వెళ్లిన రైతులు పాముకాటు సహా పలు ప్రమాదాలకు గురవుతున్నారని గుర్తు చేశారు. వేసవి మొదలుకాగానే కరెంటు కోతలు మొదలు పెట్టారని ధ్వజమెత్తారు. నిజంగా తప్పు చేయకపోతే ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ గతంలో ఈడీ నోటీసులకు స్పందించి ఎందుకు విచారణకు హాజరు కాలేదని లక్ష్మణ్ ప్రశ్నించారు.

ఇద్దరు కానిస్టేబుళ్ల సస్పెన్షన్

నమస్తే ఎఫెక్ట్

ఇసుక లారీ డ్రైవర్‌పై దౌర్జన్యం చేసినందుకు..

కేసముద్రం, మార్చి 22 : ఇసుక లారీ డ్రైవర్‌పై దౌర్జన్యానికి దిగిన కేసముద్రం పోలీస్ స్టేషన్‌కు చెందిన ఇద్దరు కానిస్టేబుళ్లు సాంబయ్య, వీరన్నను సస్పెండ్ చేసినట్టు మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 'మామూళ్లు ఇవ్వలేదని దౌర్జన్యం' శీర్షికన శుక్రవారం 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన కథనానికి స్పందించిన ఎస్పీ వెంటనే విచారణ చేపట్టారు. పోలీస్ శాఖలో పనిచేస్తూ ఇలాంటి చర్యలకు పాల్పడటం దురదృష్టకరమని పేర్కొన్నారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడిన వారు ఎంతటి వారైనా చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఎన్నికలను బహిష్కరించండి

ఏపీ ఓటర్లకు మావోయిస్టుల లేఖ

హైదరాబాద్, మార్చి 22 (నమస్తే తెలంగాణ): సామ్రాజ్యవాద, ప్రపంచీకరణ విధానాలను అనుసరిస్తున్న రాజకీయ పార్టీలను, ప్రభుత్వాలను వెంటనే బహిష్కరించాలని భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) పిలుపునిచ్చింది. ఆంధ్ర-ఒడిశా సరిహద్దు స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి గణేశ్ పేరిట ఈ లేఖను మావోయిస్టులు విడుదల చేశారు. ఎన్నికలు జరగకుండా చూడాలని, ప్రజలు ఓటు వేయడాన్ని నిరాకరించాలని కోరారు. బ్రాహ్మణీయ హిందూత్వ ఫాసిస్టు పార్టీ బీజేపీ అని, దానితో పొత్తు పెట్టుకొన్న టీడీపీ, జనసేన, అధికారంలో ఉన్న వైసీపీని తరమాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ అది కూడా ప్రజావ్యతిరేక సామ్రాజ్యవాదాన్నే పెంచిపోషిస్తున్నదని పేర్కొన్నారు.